కామారెడ్డి రైల్వేస్టేషన్ నుంచి బాలిక అదృశ్యం

మహి

వినాయక్‌నగర్, డిసెంబర్ 25 : కామారెడ్డి రైల్వేస్టేషన్ నుంచి బాలిక అదృశ్యమైంది. నాందేడ్ జిల్లా కిన్వాట్ తాలూకాకు చెందిన సిరిగొలే ఎర్రన్న.. హైదరాబాద్‌లోని లింగంపల్లి నుంచి తన అన్న కూతురు మహి (7)తో కలిసి కామారెడ్డికి ఈనెల 23న వచ్చాడు. హైదరాబాద్ తిరిగి వెళ్లేందుకు రాత్రి 9 గంటల ప్రాంతంలో కామారెడ్డి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. ట్రైన్ దొరికకపోవడంతో బుకింగ్ కౌంటర్ వద్ద పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు ఎర్రన్న లేచి చూడగా తన అన్న కూతురు మహి కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆచూకీ లభించకపోవడంతో ఎల్లంపేట్‌తో పాటు ఆర్యనగర్‌లో ఉండే వారి బంధువుల వద్దకు వెళ్లి తెలుసుకోగా ఆచూకీ దొరకలేదు. దీంతో మంగళవారం రాత్రి నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఫొటో ఆధారంగా బాలిక ఆచూకీ తెలిసిన వారు 8712658591 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

బైక్ చోరీల దొంగ అరెస్టు

వినాయక్‌నగర్, డిసెంబర్ 25 : జల్సాలకు అలవాటు పడి బైక్ చోరీలకు పాల్పడుతున్న మాక్లూర్ మండలం మామిడిపల్లికి చెందిన కరిపె సుమన్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దుబాయి నుంచి వచ్చి మద్యం తాగడం, జల్సాలకు అలవాటు పడిన కరిపె సుమన్.. నిజామాబాద్, కోరుట్ల, నవీపేట్ మండలాల్లో బైక్‌లు చోరీ చేశాడు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో చేపట్టిన వాహనాల తనిఖీలో పట్టుబడ్డాడు. పోలీసులు పట్టుకొని విచారించగా బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ. 2.5 లక్షల విలువచేసే 5 బైకులను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వినాయక్‌నగర్, డిసెంబర్ 25 : నగర శివారులోని సారంగాపూర్ గ్రామానికి చెందిన పల్లె సవిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నెహ్రూపార్కు వద్ద బుధవారం ఉదయం రోడ్డు దాటుతుండగా టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన ఆమెను స్థానికులు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి భర్త నర్సాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

వినాయక్‌నగర్, డిసెంబర్ 25 : జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని మారుతీనగర్‌లో బుధవారం చోటు చేసుకున్నది. రూరల్ ఎస్సై ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మారుతీనగర్‌కు చెందిన విష్ణు (21) కొన్నిరోజులుగా ఎలాంటి పని చేయకుండా ఉంటుండడంతో జీవితంపై విరక్తి చెంది, ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

శక్కర్‌నగర్ సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న బోధన్ టౌన్ సీఐ వెంకటనారాయణ, పాస్టర్లు

ధర్మారం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్న క్రిస్టియన్లు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 25: క్రిస్మస్ వేడుకలను జిల్లాలోని క్రిస్టియన్లు బుధవారం ఆనందంగా జరుపుకొన్నారు. కొత్త బట్టలను ధరించి ఉదయం నుంచి చర్చిలకు చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. పాస్టర్లు యేసు సందేశాన్ని వినిపించారు. చర్చి కమిటీల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. బాల్కొండలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

బాల్కొండ చర్చిలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న క్రైస్తవులు

నేటి నుంచి ఐదు రోజులపాటు నవీపేట రైల్వేగేటు మూసివేత

నవీపేట, డిసెంబర్ 25: నవీపేటలో బాసర ప్రధాన రోడ్డుపై ఉన్న రైల్వే గేటు ఎల్‌సీ నంబర్ 188ను మరమ్మతుల కారణంగా నేటి నుంచి ఐదు రోజులపాటు మూసివేస్తున్నట్లు ఉమ్రి రైల్వేశాఖ సీనియర్ ఇంజినీర్ బి.సూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు రైల్వే గేటు మూసి ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ – బాసర వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బాసర వైపు నుంచి నిజామాబాద్ వెళ్లేవారు కమలాపూర్, మహంతం, మోకాన్‌పల్లి, గుండారం మీదుగా ప్రయాణించాలని తెలిపారు. బాసర వైపునకు వెళ్లేవారు కళ్యాపూర్, సాటాపూర్, తాడ్‌బిలోలి, ఫకీరాబాద్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంగిలాల్‌ను పరామర్శిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

ధర్పల్లి, డిసెంబర్ 25 : మండలంలోని గుడితండాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంగిలాల్ నాయక్ శస్త్రచికిత్స చేయించుకోగా ఆయనను రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం పరామర్శించారు. పార్టీ కోసం పాటుపడుతున్న ప్రతిఒక్కరికీ అండగా ఉంటానన్నారు. ఏ విషయమున్నా తన దృష్టికి తేవాలని, ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. అనంతరం గుడితండా మాజీ ఉపసర్పంచ్ ఎంజ్యా కూతురి వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. బాజిరెడ్డి వెంట మాజీ ఎంపీపీ నల్ల సారిక, నాయకులు పీసు రాజ్‌పాల్, హన్మంత్‌రెడ్డి, మాజిద్, నజీర్, భూమేశ్, శ్రీనివాస్‌నాయక్, పెద్ద పోచన్న, గంగాధర్, గోపాల్‌నాయక్, గంగారెడ్డి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న 1994-95 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చందూర్, డిసెంబర్ 25 : మండలకేంద్రంలోని జగన్నాథ విద్యాలయంలో 1994-95లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని అదేపాఠశాలలో బుధవారం నిర్వహించారు. సుమారు 30 ఏండ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని విద్యార్థి దశ జ్ఞాపనకాలను నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబీకుల వివరాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి, సన్మానించారు.

జాతీయస్థాయి ఫిస్ట్‌బాల్ పోటీలకు పడకల్ విద్యార్థులు

జాతీయస్థాయి ఫిస్ట్‌పోటీలకు ఎంపికైన పడకల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 25 : జాతీయస్థాయి ఫిస్ట్ చాంపియన్‌షిప్ పోటీలకు మండలంలోని పడకల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని డిండిగల్‌లో నిర్వహించే జాతీయ సబ్‌జూనియర్, సీనియర్ ఫిస్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు సబ్‌జూనియర్ విభాగంలో పాఠశాలలో చదువుతున్న యాటకర్ల శివరామకృష్ణ, బాదావత్ విష్ణువర్ధన్, విస్లావత్ కళ్యాణి, ఈర్ల జగదీశ్వరి, సీనియర్ విభాగంలో బోండ్ల సలోని, బోండ్ల తేజ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు బోయిన్‌పల్లి కంటోన్మెంట్ గ్రౌండ్‌లో నిర్వహించిన క్యాంప్‌లో ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర జట్టులోని 12 మంది క్రీడాకారుల్లో ఆరుగురు పడకల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులే కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు జగన్మోహన్ గౌడ్, కొమ్ము వెంకట్, హెచ్ఎం గడ్డం సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వీడీసీ బృందం అభినందించింది.

జాతీయస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థులు

సిరికొండ, డిసెంబర్ 25 : జాతీయస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థులు శ్రీకాంత్, జస్వంత్ ఎంపికైనట్లు పీడీ నగేశ్ బుధవారం తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్‌లో నవంబర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జనవరి 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను ఎంఈవో రాములు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

పొతంగల్, డిసెంబర్ 25 : మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మంగళవారం రాత్రి విధులు నిర్వర్తిస్తున్న ప్రత్యేక బృందం పట్టుకున్నది. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇసుకను తరలిస్తుంగా.. ప్రత్యేక బృందం పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

ప్రత్యేకబృందం పట్టుకున్న టిప్పర్

వాజ్‌పాయ్‌కి ఘన నివాళి

మోస్రాలో వాజ్‌పాయ్ జయంతిని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నందిపేట్/ మాక్లూర్/ మోస్రా (చందూర్)/ రుద్రూర్, డిసెంబర్ 25: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ జయంతిని జిల్లావ్యాప్తంగా బీజేపీ నాయకులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసున్న బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండ/ నందిపేట్/ చందూర్, డిసెంబర్ 25: బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన హీనాబేగానికి రూ.15వేలు, కుంట శేఖర్‌కు రూ.9,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు బుధవారం అందజేశారు. నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గడ్చంద అనిల్, ఉపసర్పంచ్ లింబారెడ్డి, నాయకులు గడ్చంద ప్రదీప్, నర్సారెడ్డి, భూమన్న, శశికాంత్, భోజన్న, నితీశ్ పాల్గొన్నారు. మండలంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. నాయకులు సంజీవ్‌గౌడ్, యూనిస్, శ్రీనివాస్, విద్యాసాగర్, వాహబ్, వివేక్, మాజారుద్దీన్, రాజేశ్వర్, మల్లేశ్ యాదవ్, సాయన్న, వినేశ్, ఇంతియాస్, షోయబ్, అశోక్, ముజీబ్ పాల్గొన్నారు. నందిపేట్‌లో జూల రుకుంబాయికి రూ.42వేలు, అజయ్‌కు రూ.14,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు ఆయూబ్, జమీల్, చిన్నయ్య, ప్రభుదాస్, నిఖిల్, సాగర్, రాజేందర్ పాల్గొన్నారు. చందూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా.. మాజీ సర్పంచులు వాటిని పంపిణీ చేశారు. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన గొల్ల గంగారామ్‌నకు రూ. 60 వేలు, జుబేదా బేగానికి రూ.15 వేలు, చందూర్ గ్రామానికి చెందిన గుర్ల మల్లయ్యకు రూ. 28,500, మేడ్‌పల్లి గ్రామానికి చెందిన గుగులోత్ లింబ్యాకు రూ.20వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సాయారెడ్డి, సత్యనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిశు అభియాన్ ఉద్యోగుల నిరసన

కంఠేశ్వర్, డిసెంబర్ 25 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ధర్నాచౌక్ వద్ద సమగ్ర శిశు అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. సమ్మె శిబిరాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బుధవారం సందర్శించి మాట్లాడారు. న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మాట్లాడతానని ఎస్ఎస్ఏ ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యేతో సమస్యలు చెబుతూ కంటతడి పెట్టారు. ఎవరూ అధైర్యపడొద్దని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి భూపేందర్, కోశాధికారి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, నాయకులు రాజు, విద్యాసాగర్, రాణి, సుప్రజ, గంగాధర్, అఫ్సర్, గిరీశ్, రమేశ్, శ్రీనివాస్, నగేశ్‌గౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

సమ్మె శిబిరాన్ని సందర్శించి, సమస్యలు తెలుసుకుంటున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

బాధిత కుటుంబానికి మిత్రుల ఆర్థిక సాయం

చందూర్ మండలకేంద్రానికి చెందిన ఇబ్రహీం ఇటీవల మృతిచెందాడు. చిన్ననాటి స్నేహితులు మిత్రుడి కుటుంబానికి రూ. 30 వేలు బుధవారం అందజేశారు.
—చందూర్, డిసెంబర్ 25

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్‌పర్సన్ నియామకం

సుభాష్‌నగర్, డిసెంబర్ 25 : బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌గా దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్య నియామకమయ్యారు. జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్ గీతాభవనంలో సంక్షేమ వేదిక కార్యవర్గ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రతినిధి యుగేందర్ హాజరై మాట్లాడారు. ఏడాదిపాటు స్థబ్దుగా ఉన్న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు వైస్ చైర్‌పర్సన్‌ను నియమించడంపై పరిషత్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

భార్యను నరికి చంపిన భర్త

నిజాంసాగర్, డిసెంబర్ 25 : భార్యను కత్తితో నరికి చంపిన ఘటన బుధవారం మహ్మద్‌నగర్ మండలంలోని అవుసుల తండాలో చోటు చేసుకున్నది. ఎస్సై శివకుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అవుసుల తండాలో మెగావత్ మోతీబాయి (55)ను ఆమె భర్త షెర్యా నాయక్ కత్తితో మెడపై నరికి చంపాడు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు.

నాయక్‌పోడ్‌ల సర్వసభ్య సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న నాయక్‌పోడ్ జిల్లా బాధ్యుడు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 25: పట్టణంలోని భీమన్న మందిర ఆవరణలో ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్ ఆధ్వర్యంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. నాయక్‌పోడ్ యువత ఉన్నత చదువులు అభ్యసించి, ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్కృతీ సంప్రదాయాలు పాటించాలన్నారు. సమావేశంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

28న విలీన సభ

మాక్లూర్, డిసెంబర్ 25: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ విలీన సభను 28వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013లో న్యూడెమోక్రసీ రెండు పార్టీలుగా విడిపోయి కార్యక్రమాలను నిర్వహించిందని పేర్కొన్నారు. రెండు పార్టీ ల ఐక్యతతో దేశంలో ప్రజాస్వామ్య విప్లవం సాధ్యమని విలీనం అవుతున్నట్లు తెలిపారు. 28న నిర్వహించే సభకు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ధ్యాన మహాయజ్ఞంలో జిల్లావాసులు

నందిపేట్, డిసెంబర్ 25: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్సాన్‌పల్లిలో ధ్యాన మహాయజ్ఞం కొనసాగుతున్నది. ఈనెల 21వ తేదీన ప్రారంభమైన మహాయజ్ఞం 31వ తేదీ వరకు కొనసాగనున్నది. ఈ మహాయజ్ఞంలో జిల్లా నుంచి రెండు వేల మంది ధ్యాన బంధువులు పాల్గొంటున్నారని పీఎస్ఎస్ఎం జిల్లా అడ్వకేట్ సాయికృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ప్రపంచ శాంతి కోసం ప్రతిరోజూ ఉదయం ఐదు నుంచి ఎనిమిది గంటల వరకు అఖండ ధ్యానం, పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మిక గురువుల ప్రవచనాలు, ఉచిత అన్నప్రసాద వితరణ, వసతి ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను జాప్యం లేకుండా అమలు చేయాలి

వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ

శక్కర్‌నగర్, డిసెంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ప్రకటించిన అన్ని పథకాలను జాప్యం లేకుండా అమలు చేయాలని వికలాంగ హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి అయినా.. దివ్యాంగులకు పెంచి ఇస్తామన్న పింఛన్లు పెంచలేదని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఇస్తామన్న సంక్షేమ పథకాలు జాప్యం లేకుండా అమలు చేయని పక్షంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అదే విధంగా వికలాంగులకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, నూతనంగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు పింఛన్లు జాప్యం లేకుండా అందించాలని, ప్రతి దివ్యాంగునికి అంత్యోదయ పథకం కింద కార్డులు జారీ చేయాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 25: మండలంలోని పిప్రి గ్రామంలో పేకాడుతున్నారనే పక్కా సమాచారం మేరకు మంగళవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. పేకాడుతున్న ఐదుగురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని, వారి నుంచి రూ.ఎనిమిది వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

సీసీఎస్ సిబ్బంది పట్టుకున్న పీడీఎస్ బియ్యం

మాక్లూర్, డిసెంబర్ 25: ఇన్‌చార్జి సీపీ ఆదేశాల మేరకు ఏసీపీ సీసీఎస్ నాగేంద్రచారి ఆధ్వర్యంలో సీసీఎస్ సిబ్బంది మండల కేంద్రంలోని రహమత్‌నగర్‌లో బుధవారం దాడిచేశారు. ఈమేరకు డంప్ చేసిన 20క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బియ్యం నిల్వ చేసిన షఫీపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ కవిత పంపిన కేక్‌లను పాస్టర్లకు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవిత సహకారంతో చర్చిలకు కేక్‌ల పంపిణీ

పాస్టర్లకు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

నవీపేట, డిసెంబర్ 25: నవీపేట మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న 31 చర్చిలకు క్రిస్మస్ పండుగ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత కేక్‌లను సరఫరా చేశారు. వాటిని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వి.నర్సింగ్ రావు, నాయకులు కలిసి ఆయా గ్రామాల చర్చిల పాస్టర్లకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఎమ్మెల్సీ కవిత మండలంలోని చర్చిలకు కేక్‌లను పంపిణీ చేస్తారని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రైస్తవుల అభ్యున్నతికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని చెప్పారు. అనంతరం ఇండియన్ పెంతెయన్ చర్చిలో క్రిస్మస్ పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దొంత ప్రవీణ్‌కుమార్, లోకం నర్సయ్య, బి.సూరిబాబు, గైని సతీశ్, పాస్టర్లు నెహెమ్యా, రమేశ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.